
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రంగారెడ్డి

5 జిల్లా వార్తలు

సోమవారం 26 ఫిబ్రవరి 2024

ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయాలి

ఆమనగల్లు, ఫిబ్రవరి 25:ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల, తలకొండపల్లి మండల కేంద్రాల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని బీజేవైఎం కల్వకుర్తి నియోజక వర్గ కన్వీనర్ పద్మఅనిల్ కోరారు. ఆధార్ నమోదు కేంద్రాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆదివారం ఆమనగల్లులో విలేఖరులతో పద్మఅనిల్ మాట్లాడుతూ ఆధార్ నమోదు, మార్పులు, చేర్పులకు ప్రజలు నాగర్‌కర్నూల్, హైదరాబాద్, మహబూబ్‌నగర్, వెల్దండ, కల్వకుర్తి ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. పది రోజుల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయకుంటే నిరసనలు చేపడతామన్నారు. నాయకులు రాఘవేందర్, శేఖర్, శ్రీహరి, యాదగిరి పాల్గొన్నారు.



అన్ని శాఖలు ఒకే కాంప్లెక్స్‌లో ఉంటాయని, అన్ని విభాగాల అధికారులు ఒకే బిల్డింగ్‌లో ఉంటారనే ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం ప్రతీ జిల్లాకు సమీకృత కలెక్టరేట్ కాంప్లెక్స్‌లను నిర్మించింది. రంగారెడ్డి కలెక్టరేట్‌ను ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ఔటర్ రింగ్ రోడ్డు పక్కన కొంగరకలాన్ వద్ద కట్టించారు. అయితే నూతన కలెక్టరేట్ ఏ కొన్ని మండలాలకో తప్ప చాలా ప్రాంతాల వారికి దూరాభారంగా మారింది. చేవెళ్ల, కల్వకుర్తి, షాద్‌నగర్ నియోజకవర్గాల ప్రజలకు కలెక్టరేట్ 90 కిలోమీటర్ల దూరం ఉంది. కార్యాలయానికి చేరేందుకు బస్సు సౌకర్యం లేక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. పెట్రోల్, డీజిల్, టోల్‌చార్జీలతో ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. ఉద్యోగులకూ సరైన రవాణా సౌకర్యాల్లేవు. పనుల కోసం వచ్చే ప్రజలకు రోజంతా ఇక్కడికి రావడంతోనే సరిపోతోంది. తెలంగాణ పోలీస్ అకాడమీ జంక్షన్ వద్ద కలెక్టర్ పెడితే అనుకూలంగా ఉంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

దూ భా రం!

కలెక్టరేట్‌కు వెళ్లాలంటే వ్యయప్రయాస

గ్రామీణ ప్రజలకు బహుదూరం

- పేరుకే సమీకృతం.. కార్యాలయాలన్నీ బయటే?
- కలెక్టరేట్ ఉద్యోగులను వేధిస్తున్న అసౌకర్యాలు
- కొత్త కలెక్టరేట్‌కు వచ్చాక హెచ్‌ఆర్‌ఏలో కోత
- 24 శాతం నుంచి 11శాతానికి తగ్గింపు
- కలెక్టరేట్‌ను పోలీస్ అకాడమీ జంక్షన్ వద్దకు మార్చాలని జిల్లా వాసుల డిమాండ్



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 25): ప్రజలకు అన్ని శాఖలూ ఒకే చోట ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాన్ని కట్టించింది. అయితే జిల్లా కలెక్టరేట్ నగరానికి దూరంగా కొంగరకలాన్‌లో ఏర్పాటు చేయడంతో గ్రామీణులు కలెక్టరేట్‌కు చేరుకోవాలంటే కష్టంగా మారింది. కలెక్టరేట్ ఉద్యోగుల కోసం ఆర్టీసీ అరకొర బస్సులను ఏర్పాటు చేసింది. ఉదయం 11గంటలకు, సాయంత్ర 5గంటలకు ఉద్యోగుల కోసం బస్సులు నడుపుతున్నారు. కానీ.. అక్కడికి ప్రజలు వెళ్లాలంటే.. నానా అవస్థలు పడుతున్నారు. పేరుకు మాత్రమే సమీకృతం కానీ కీలక శాఖలన్నీ ఈ కాంప్లెక్స్ బయటే ఉన్నాయి. ఇదిలా ఉంటే ఉద్యోగులను అసౌకర్యాలు వేధిస్తున్నాయి. కొత్త కలెక్టరేట్ కొంగరకలాన్‌కు వచ్చాక ఉద్యోగుల హెచ్‌ఆర్‌ఏకు కోతపడింది. అందరికీ అందుబాటులో ఉంచే చోటకు కలెక్టరేట్‌ను మార్చాలని, తెలంగాణ పోలీస్ అకాడమి (టీఎస్‌పీఏ జంక్షన్) వద్ద కలెక్టరేట్‌ను ఏర్పాటు చేయాలని జిల్లా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నూతన జిల్లాల ఏర్పాటుతో ...

నాటి ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి తన మేనమామ కొండా వెంకట రంగారెడ్డి పేరుతో 1978లో రంగారెడ్డి జిల్లాను ఏర్పాటు చేశారు. జిల్లాకు సంబంధించి హైదరాబాద్ కేంద్రంగానే 44ఏళ్లు పాలన సాగింది. రోడ్డు రవాణా, ట్రైన్ సౌకర్యాలున్న లక్డీకాపూల్‌లో రంగారెడ్డి కలెక్టరేట్‌ను ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు రంగారెడ్డి జిల్లాలో 37రెవెన్యూ మండలాలుండేవి. 2014లో రాష్ట్రం ఏర్పాటు తర్వాత 2016లో నూతన జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాలను ఏర్పాట్లు చేశారు. జిల్లాల పునర్విభజనలో రంగారెడ్డి జిల్లాను మూడు (రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి) జిల్లాలుగా చేశారు. ప్రస్తుతం రంగారెడ్డి జిల్లాలో 5రెవెన్యూ డివిజన్లు, 27 మండలాలు, 8అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత ప్రతీ జిల్లాలో సమీకృత కలెక్టరేట్ భవనాలు నిర్మించారు. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌ను ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కొంగరకలాన్‌లో కొత్త కలెక్టరేట్ నిర్మాణానికి అప్పటి రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి పద్మారావు 2017 అక్టోబరు 12న శంకుస్థాపన చేశారు. ఐదేళ్లలో పనులను పూర్తిచేశారు. 42 ఎకరాల్లో రూ.58.2కోట్లతో కలెక్టరేట్ సముదాయాన్ని నిర్మించారు. 2022 ఆగస్టు 25న అప్పటి సీఎం కేసీఆర్ జిల్లా కలెక్టరేట్‌ను ప్రారంభించారు. ఏళ్ల తర్వాత జిల్లాకు హెడ్‌క్వార్టర్ ఏర్పడినట్టయింది. పాత కలెక్టరేట్ భవనాన్ని హైదరాబాద్ కలెక్టరేట్‌కు కేటాయించారు.

షాద్‌నగర్ ప్రజలు మూడు బస్సులు మారాల్సిందే

షాద్‌నగర్ నియోజకవర్గం నుంచి కలెక్టరేట్‌కు చేరుకోవాలంటే నేరుగా బస్సు సౌకర్యం లేదు. చౌదరిగూడ ప్రజలకు కొంగరకలాన్‌కలెక్టరేట్ 65కిలో మీటర్ల దూరం. వీరు కలెక్టరేట్‌కు వెళ్లాలంటే.. మూడు బస్సులు మారాల్సి వస్తోంది. చౌదరిగూడ నుంచి కొందుర్గు రావాల్సి వస్తుంది. అక్కడ నుంచి మళ్లీ షాద్‌నగర్‌కు మరో బస్సు ఎక్కాలి. అలాగే షాద్‌నగర్ నుంచి మహేశ్వరం వరకు మరో బస్సు ఎక్కాలి. అక్కడికి వెళ్లాక కొంరగకలాన్ వెళ్లేందుకు బస్సు సౌకర్య లేదు. ప్రైవేట్ వాహనాలూ తక్కువే. అయినా ఈ వాహనాలకు అనుమతి లేదు. అవసరం ఉన్న వారు అవస్థలు పడుకుంటూ కలెక్టరేట్‌కు పోతున్నారు.

పోవాలంటే ఖర్చులు తడిసి మోపడు!

ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, రాజేంద్రనగర్ నియోజకవర్గాల ప్రజలకు కొత్త కలెక్టరేట్ చేరువలోనే ఉంది. చేవెళ్ల, కల్వకుర్తి, షాద్‌నగర్, శేరిలింగంపల్లి, ఎల్బీనగర్ నియోజవర్గాల ప్రజలకు మాత్రం దూరమైంది. సొంత వాహనాలున్న వారు కలెక్టరేట్‌కు సులభంగానే వెళ్లొచ్చు. అయితే పెట్రోల్, డీజిల్ ఖర్చులు, టోల్ చార్జీలు తడిసి మోపడవుతున్నాయి. గచ్చిబౌలితో పాటు రాష్ట్ర పోలీసు అకాడమి నుంచి కొంగరకలాన్ వరకు టోల్‌చార్జి రాను పోను 180రూపాయలు పడుతుంది. ఔటర్‌పై టూ వీలర్స్‌కు, బస్సులకు అనుమతి లేదు. సర్వీసు రోడ్డులో వెళ్లి కలెక్టరేట్ చేరుకుందామనుకుంటే.. తొండుపల్లి వద్ద రోడ్డు పనులు నిలిచిపోయాయి. శంషాబాద్ మున్సిపాలిటీ నుంచి తొండుపల్లి శివారు అమీదుల్లానగర్ వరకు రెండు వైపులా సర్వీసు రోడ్డు పనులు నిలిచిపోయాయి. సర్వీసు రోడ్డుకు భూములు కోల్పోయిన కొందరు నిర్వాసితులు తమకు పరిహారం ఇవ్వలేదని కోర్టును ఆశ్రయించారు. దీంతో పదేళ్లుగా పనులు నిలిచిపోయాయి. 4.5 కిలోమీటర్ల సర్వీసు రోడ్డు పనులు పూర్తి చేస్తే బస్సులు, ద్విచక్ర వాహనదారులు ఔటర్‌పైకి ఎక్కకుండా నేరుగా కలెక్టరేట్‌కు చేరుకునే అవకాశం కలుగుతుంది.

కల్వకుర్తి ప్రజల కష్టాలు వర్ణనాతీతం

కల్వకుర్తి నియోజకవర్గం మాడ్గుల గ్రామం నుంచి కొంగరకలాన్‌లోని కలెక్టరేట్‌కు చేరుకోవాలంటే 80కిలోమీటర్ల దూరం అవుతుంది. ఆ గ్రామస్తులు యాచారం, ఇబ్రహీంపట్నం మండలాలను దాటుకొని రావాలి. సరైన రవాణా సౌకర్యం లేదు. తుక్కుగూడ, బొంగలూరు మధ్య రవాణా సౌకర్యం మెరుగుపరిస్తే సౌకర్యవంతంగా ఉంటుందంటున్నారు. బొంగులూరు జంక్షన్ నుంచి ఆదిభట్ల, తుక్కుగూడ మీదుగా కొంగరకలాన్‌కు బస్సులు వేయాలంటున్నారు. ఈ జంక్షన్ నుంచి బస్సు సౌకర్యం కల్పిస్తే.. ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, కందుకూరు, మహేశ్వరం మండలాలకు సౌకర్యవంతంగా ఉంటుందంటున్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గ ప్రజలకు కూడా బొంగులూరు జంక్షన్ సరైందిగా ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

చేవెళ్ల వాసులకు మరింత దూరంగా కలెక్టరేట్

శంకర్‌పల్లి మండలం అంతప్పగూడ గ్రామస్తులు కొంగరకలాన్ చేరుకోవాలంటే.. 95కిలోమీటర్లు అవుతుంది. అంతప్పగూడ గూడ నుంచి శంకర్‌పల్లి వరకు 12కిలో మీటర్లు. అక్కడి నుంచి నుంచి మెహిదీపట్నం 40కిలోమీటర్లు, మెహిదీపట్నం నుంచి కొంగరకలాన్‌కు 45కిలోమీటర్ల దూరం. ఇలా చేవెళ్ల మండలం కౌకుంట్ల, అంతారం, హస్తేపూర్, నవలాయపల్లి గ్రామస్తులకు కలెక్టరేట్ కంటే.. వికారాబాద్ కలెక్టరేట్ దగ్గరవుతోంది. జిల్లా వాసులకు వికారాబాద్ కలెక్టరేట్ 15కిలో మీటర్ల దూరం కాగా.. కొంగరకలాన్ 90కిలోమీటర్ల పైగానే దూరం ఉంది. రెండు మూడు బస్సులు ఎక్కి దిగాల్సి వస్తుంది. చేవెళ్ల నియోజకవర్గ ప్రజలు కలెక్టరేట్‌కు చేరుకునేందుకు చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్ మండల కేంద్రాల నుంచి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. తెలంగాణ పోలీసు అకాడమీ జంక్షన్ నుంచి కొంగర కలాన్‌కు బస్సులను నడిపిస్తే చేవెళ్ల, శేరిలింగంపల్లి ప్రజలకు సౌకర్యవంతగా ఉంటుందంటున్నారు.

కీలక శాఖలన్నీ బయటే!

పేరుకే సమీకృత కలెక్టరేట్! కీలక శాఖలన్నీ బయటే కొనసాగుతున్నాయి. కార్యాలయాలన్నీ ఒకే చోటకు చేర్చి ప్రజల సౌకర్యం, పాలన సౌలభ్యం కోసం కలెక్టరేట్ కాంప్లెక్స్ నిర్మించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. వైద్యశాఖ, పశుసంవర్ధకశాఖ, ఎక్సైజ్ శాఖ, ఆర్టీవో, పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, డ్రగ్, మార్కెటింగ్, మార్క్‌ఫెడ్, డీసీఎంఎస్, విద్యుత్ శాఖ, జిల్లా ఉపాధి కల్పన, కాలుష్య నియంత్రణ, చేనేత, అటవీ, జిల్లా ఇంటర్మీడియట్, తదితర శాఖలన్నీ బయటే కొనసాగుతున్నాయి.

శేరిలింగంపల్లి వాసుల అవస్థలు

శేరిలింగంపల్లి నియోజవర్గం నుంచి కొంగరకలాన్ చేరుకోవాలంటే 70కిలోమీటర్ల దూరం అవుతుంది. ఇక్కడి ప్రజలు వెళ్లాలంటే ఔటర్‌పై నుంచి వెళ్లాలి. లేదా హైదరాబాద్ మీదుగా చేరుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్య పట్టి పీడిస్తోంది. హైదరాబాద్ నుంచి వెళ్లాలంటే.. సగం దినం పడుతుందంటున్నారు. ఔటర్ నుంచి సర్వీసు రోడ్డు సౌకర్యం లేక పోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. శేరిలింగంపల్లి నుంచి కొంగరకలాన్ వరకు ఔటర్‌పై వెళ్లేందుకు బస్సులకు అనుమతి ఇవ్వాలని కోరుతున్నారు. కలెక్టరేట్ వెళ్లే ప్రజలకు ఔటర్‌పై టోల్ చార్జీలను వసూలు చేయొద్దని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఉద్యోగులకు భారీగా తగ్గిన హెచ్ఆర్ఏ

లక్డీకాపూల్‌లో కలెక్టరేట్ ఉన్నప్పుడు నగర ఖర్చుల మేరకు ఉద్యోగులకు 24శాతం హెచ్‌ఆర్‌ఏ ఉండేది. కొంగరకలాన్‌లోని కొత్త కలెక్టరేట్‌లోకి వచ్చాక గ్రామీణం లెక్కల ప్రకారం హెచ్‌ఆర్‌ఏలో కోత పడింది. ప్రస్తుతం 11శాతం హెచ్‌ఆర్‌ఏ వర్తిస్తుంది. జిల్లా స్థాయి ఉద్యోగులకు వేతనంలోనూ రూ.15వేల నుంచి 18వేల వరకు తగ్గిందంటున్నారు. కలెక్టరేట్ బహుదూరం ఉండటంతో పెట్రోల్, డీజిల్‌తో పాటు టోల్‌చార్జీల భారం ఎక్కువవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే బస్సులుండటంతో నానా ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. సాయంత్రం వేళల్లో కలెక్టర్ సమీక్షలు నిర్వహిస్తే.. ఆ రోజు బస్సు మిస్ కావడంతో పరిస్థితి ఘోరంగా ఉంటుందంటున్నారు.

కలెక్టరేట్‌ను అప్పా జంక్షన్ వద్దకు మార్చాలి



మంత్రులు, బడా నేతల భూముల విలువ పెంచేందుకే కొంగరకలాన్‌లో కలెక్టరేట్‌ను ఏర్పాటు చేశారు. కలెక్టరేట్‌కు వెళ్లి రావాలంటే రెండు వందల కిలో మీటర్లు ప్రయాణం అవుతుంది. అదే వికారాబాద్ కలెక్టరేట్ కేవలం 15కిలో మీటర్ల దూరంలో ఉంది. మా చేవెళ్ల నియోజకవర్గాన్ని వికారాబాద్‌లో కలపాలి. లేదా కలెక్టరేట్‌ను అప్పా జంక్షన్ వద్దకు తరలించాలి.

- శ్రీనివాస్‌గౌడ్, కౌకుంట్ల, చేవెళ్ల మండలం

లక్డీకాపూల్‌లో కలెక్టరేట్ అందరికీ అందుబాటులో ఉండేది



హైదరాబాద్‌లోని లక్డీకాపూల్‌లో కలెక్టరేట్ అందరికీ అందుబాటులో ఉండేది. హైదరాబాద్ కలెక్టరేట్ వెళితే మిగతా పనులు సైతం చూసుకొని వచ్చేవారం. ఇప్పుడేదైనా పని పడితే ప్రత్యేకంగా వెళ్లాల్సిందే. కొంగరకలాన్ వెళ్లాలంటే.. మూడు బస్సులు మారాల్సి వస్తుంది. అయినా.. కొంగరకలాన్‌కు వెళ్లేందుకు బస్సు సౌకర్యం లేదు. బైక్‌పై వెళ్లే పరిస్థితి లేదు. కలెక్టర్ వరకు అన్ని చోట్ల నుంచి వచ్చేందుకు వీలుగా బస్సు సౌకర్యం కల్పించాలి.

- జి.నర్సింహులు, జిల్లేడు చౌదరిగూడ

అందరికీ దగ్గరగా ఉండే చోటకు మార్చాలి



మారుమూల ప్రాంతాల నుంచి కలెక్టరేట్ వెళ్లేందుకు ఇబ్బందిగా మారింది. మా ఊరు నుంచి కలెక్టరేట్‌కు 70కిలో మీటర్ల దూరం. నాలుగైదు బస్సులు మారాల్సి ఉంటుంది. ఏదైనా పని ఉంటే ఒక రోజు పడుతోంది. ప్రస్తుత కలెక్టరేట్ అందరికీ దూరంగానే ఉంది. పోలీస్ అకాడమీ జంక్షన్ వద్ద కలెక్టరేట్ పెడితే జిల్లాలోని అన్ని ప్రాంతాల వారికి సౌకర్యవంతంగా ఉంటుంది.

- రాజ్‌కుమార్, పెద్ద ఎల్కిచర్ల, చౌదరిగూడ మండలం



సేవాలాల్ విగ్రహం వద్ద కేటీఆర్, నాయకులు

సంత్ సేవాలాల్ మార్గం అనుసరణీయం

- బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఆమనగల్లు, ఫిబ్రవరి 25 : సంత్ సేవాలాల్ సమాజానికి చేసిన సేవలు మరువలేనివని, ఆయన చూపిన మార్గం అందరికీ అనుసరణీయం అని బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆమనగల్లులో గల సేవాలాల్ ఘాట్ వద్ద సేవాలాల్ 285వ జయంతి వారోత్సవాలను ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన కేటీఆర్‌ను లంబాడాలు సంప్రదాయ ఆభరణాలతో సత్కరించారు. స్థానిక నాయకులతో కలిసి సేవాలాల్ విగ్రహానికి కేటీఆర్ పూలమాలలు వేశారు. అనంతరం మాట్లాడుతూ గిరిజనోద్ధరణకు సేవాలాల్ చేసిన కృషి మరువలేనిదన్నారు. మత్తు పానీయాలు, హింసకు దూరంగా ఉండాలని సేవాలాల్ ఇచ్చిన సందేశాన్ని అందరూ పాటించాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గిరిజనుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. తండాలను పంచాయతీలుగా చేశామన్నారు. ఆమనగల్లులో సేవాలాల్ కమ్యూనిటీ హాల్, ఆలయ నిర్మాణానికి ఎన్నికలకు ముందు రూ.2కోట్లు కేటాయించి పనులు ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే జి.బాల్‌రాజ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మిషన్ భగీరథ కార్పొరేషన్ మాజీ వైస్‌చైర్మన్ ఉప్పల వెంకటేశ్, సీఐ విజయ్‌కుమార్, గిరిజన సంఘాల నాయకులు కృష్ణనాయక్, రవీందర్, అమర్‌సింగ్, పంతూ, శ్రీను, రమేశ్, శంకర్, సురేశ్, రాంజా, ఎస్ఐ బాల్‌రామ్ నాయక్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్, చంద్రబాబు ఆశీస్సులతోనే ఈ స్థాయికి..

- ఐదేళ్లుగా నమ్మించి మోసగించిన కేసీఆర్
- ప్రజలకు మరింత సేవచేసేందుకే కాంగ్రెస్‌లోకి..
- నేడు దీపాదాస్ మున్షీ సమక్షంలో పార్టీలో చేరతాం
- మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ అనిత
- కేసీఆర్, సబితలపై మామా కోడళ్ల సంచలన వ్యాఖ్యలు



బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన పత్రాలను చూపుతూ మాట్లాడుతున్న తీగల కృష్ణారెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

మహేశ్వరం, ఫిబ్రవరి 25: దివంగత ఎన్టీఆర్, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుల ఆశీస్సులతోనే తాము ఈ స్థాయికి వచ్చామని మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి అన్నారు. ఐదేండ్లలో ఆశలు కల్పించి తనను, తన కుటుంబాన్ని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి సబితారెడ్డి మోసం చేశారని, పార్టీలో గుర్తింపునివ్వకుండా అడుగడుగునా అవమానించారని తీగల కృష్ణారెడ్డి, ఆయన కోడలు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ డాక్టర్ అనితారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మీర్‌పేటలోగల టీకేఆర్ కళాశాలలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. ఎంతో మంది ప్రాణ త్యాగాలతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో పదేండ్లు దొరల సామ్రాజ్యాన్ని తలపించేలా పాలకులు వ్యవహరించారని, రాష్ట్రంలో కొందరి అధికారమే చెలామణీ అయ్యిందన్నారు. కాంగ్రెస్‌లో గెలిచిన సబితారెడ్డిని ప్రభుత్వంలోకి తీసుకోవడం తమను బాధించిందన్నారు. బీఆర్ఎస్ అధిష్ఠానంలో మార్పు వస్తుందేమోనని ఐదేండ్లు పార్టీకి పనిచేసినా గుర్తింపు ఇవ్వలేదన్నారు. కేసీఆర్ పాలనలో అనుభవించిన బాధలు, అవమానాలు తట్టుకోలేకే తాము బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు. రాజీనామా పత్రాలను ఈ-మెయిల్‌లో పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌కు పంపామన్నారు. బీఆర్ఎస్ పాలనలో స్థానిక సంస్థలకు నిధులేక ఇబ్బందులు ఎదుర్కోవలసి వచ్చిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించి తమతో పాటు మరి కొందరు ముఖ్యనాయకులతో ఈ నెల 26న గాంధీ భవన్ వెళ్లి కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్‌లో పార్టీలో చేరుతాం అన్నారు. మహేశ్వరం నియోజకవర్గానికి, జిల్లా ప్రజలకు సేవ చేసేందుకు కాంగ్రెస్‌లో చేరుతున్నామన్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు అన్యాక్రాంతమయ్యాయన్నారు. పేదల సీలింగ్ భూములను కూడా కొందరు బీఆర్ఎస్ నాయకులు కబ్జా చేశారన్నారు. నందమూరి తారక రామారావు, చంద్రబాబునాయుడు తమకు అభివృద్ధి నేర్పారు తప్పా అవినీతి నేర్పలేదన్నారు. ఆదే స్పూర్తితో రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజాసేవ చేస్తామన్నారు. సమావేశంలో అనితారెడ్డి, కృష్ణారెడ్డితో పాటు బీఆర్ఎస్ నాయకులు బేర బాలకిషన్, రాకేశ్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, షేక్ ఆజం, శ్రీవారెడ్డి, రఘుపతి, సంతోష్‌రెడ్డి, నాగేందర్‌గౌడ్, పాండుగౌడ్, సదానంద్‌గౌడ్, వెంకట్‌గౌడ్, శైలజారెడ్డి బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు.

మహేశ్వరాన్ని కాంగ్రెస్ కంచుకోటగా మారుద్దాం



బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు కాంగ్రెస్ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న కేఎల్లార్

మహేశ్వరం, ఫిబ్రవరి 25: మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ కంచుకోటగా మారాలని, అందుకు నియోజకవర్గంలో బీఆర్ఎస్‌ను ఖాళీచేసి కాంగ్రెస్‌ను బలంగా తయారుచేయాలని మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి కార్యకర్తలకు సూచించారు. కార్యకర్తల కష్టసుఖాల్లో తమ సహాయ సహకారాలు ఉంటాయన్నారు. ఆదివారం మహేశ్వరానికి చెందిన కె.చందు, పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. వారికి లక్ష్మారెడ్డి పార్టీ కండువాలు కప్పి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు పేదలకు చేరవేయడంలో కార్యకర్తలు కృషిచేయాలన్నారు. పార్టీకి పనిచేసే కార్యకర్తలను కాంగ్రెస్ ఎప్పుడూ మరిచిపోదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామన్నారు. ఎమ్మెల్యే బీఆర్ఎస్ కావచ్చు కానీ ప్రభుత్వం కాంగ్రెస్‌దనే విషయాన్ని కార్యకర్తలు మరిచిపోవద్దన్నారు. తాను ఎల్లవేళలా కార్యకర్తలకు అందుబాటులో ఉంటానన్నారు. ఏ కష్టం, సుఖం వచ్చినా అండగా ఉంటానని, తనను ఎప్పుడైనా సంప్రదించవచ్చన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలను పదేళ్లు బీఆర్ఎస్ నాయకులు పలు రకాలుగా ఇబ్బందులకు గురి చేశారన్నారు. కానీ కాంగ్రెస్ ప్రజల పక్షాన పని చేస్తుందన్నారు. గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలు వేసి ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేసే పనిని కమిటీలకు ఇస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, కూన యాదయ్య, కాకి ఈశ్వర్, అల్లె కుమార్, రఘుపతి, కె.రాములు, లాజర్, శ్రీకాంత్, జంగయ్య, పరమేశ్, మహేందర్, రాఘవేందర్, శివ, సతీష్, జగదీష్, ఉపేందర్, ప్రవీణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



'అమృత్ భారత్'కు షాద్‌నగర్ రైల్వే స్టేషన్ ఎంపిక

- ఆధునిక వసతుల కోసం 9.59కోట్లు మంజూరు

షాద్‌నగర్, ఫిబ్రవరి 25: రైల్వే స్టేషన్ల ఆధునికీకరణలో భాగంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అమృత్ భారత్ కార్యక్రమానికి షాద్‌నగర్ రైల్వే స్టేషన్ ఎంపికైంది. రాష్ట్రంలో ఎంపిక చేసిన 15రైల్వేస్టేషన్లలో షాద్‌నగర్‌కు ఉండడంపై దక్షిణ మధ్య రైల్వే డీఆర్ గోపాల్‌నారాయణ ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. అమృత్ భారత్‌లో భాగంగా షాద్‌నగర్ రైల్వే స్టేషన్‌లో మినీ ఎయిర్ పోర్ట్ తరహాలో ఆధునికీకరిస్తారని తెలిపారు. ప్రధాన ద్వారంతో పాటు ట్రాఫిక్ వసతులు, వెయిటింగ్ రూములు, ప్రయాణికులకు వీలుగా సమాచార సూచికలను వృద్ధిచేసేందుకు రూ.9.59కోట్లు మంజూరు చేశారన్నారు. కాగా అమృత్ భారత్ రైల్వే స్టేషన్లలో చేపట్టే పనులకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ సోమవారం ఉదయం 10:30 గంటలకు వర్చువల్ ద్వారా ప్రారంభించనున్నారని, ఈ కార్యక్రమానికి పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.



బోనాలతో ఆలయానికి తరలుతున్న మహిళలు, గ్రామస్తులు

వెంకమ్మగూడలో ఘనంగా మల్లన్న బోనాలు

షాబాద్, ఫిబ్రవరి 25 : మండల పరిధి వెంకమ్మగూడలో ఆదివారం మల్లన్న బోనాలను ఘనంగా నిర్వహించారు. శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు, యువకులు కేరింతల మధ్య బోనాలు, తొట్టెల ఊరేగింపును నిర్వహించారు. గ్రామస్తులంతా మల్లన్న స్వామి ఆలయానికి తరలి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు బోన నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మద్దూరి శకుంతల, మాజీ ఎంపీటీసీ పాండు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చెన్నకేశవస్వామి పెద్ద రథోత్సవం



పెద్ద రథాన్ని లాగుతున్న భక్తులు

కడ్తాల్, ఫిబ్రవరి 25: కడ్తాలలోని ప్రసిద్ధ శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. ఆదివారం తెల్లవారుజామున స్వామి వారి బ్రహ్మ రథోత్సవాన్ని(పెద్దతేరు) నిర్వహించారు. రథంపై స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ఉంచి తాళ్లతో రథాన్ని లాగారు. పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వేణుగోపాల్, ఆలయ కమిటీ అధ్యక్షుడు పాలాది ఆంజనేయులు, ఎంపీటీసీ గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, అర్చకులు వెంకటేశ్వరశర్మ, వేణుగోపాల్, శ్రీధర్, శ్రీమన్నారాయణ, వెంకటేశ్, నర్సింహ్మమూర్తి, నాయకులు వెంకటేశ్, బ్రహ్మచారి, భాస్కర్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్, సత్యం, రాఘవేందర్, సాయిరెడ్డి, నరేందర్‌రెడ్డి, రాజు, రాజేశ్, రాజేందర్‌గౌడ్, మహేందర్, రాజేశ్, ప్రవీణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలకు ఆర్షితులై కాంగ్రెస్‌లో చేరికలు

చేవెళ్ల, ఫిబ్రవరి 25 : కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులై ఇతరప పార్టీల నేతలు తమ పార్టీలో చేరుతున్నారని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఆదివారం చేవెళ్ల పట్టణ కేంద్రానికి చెందిన సీనియర్ నేత కుంచం శివకుమార్‌గుప్తా బీఆర్ఎస్ నుంచి తన అనుచరులతో కలిసి మంత్రి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. శివకుమార్‌కు కాంగ్రెస్ కండువా కప్పి మంత్రి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి పాలనలో పేదలకు న్యాయం జరుగుతోందన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు పేదలకు ఎంతో మేలు చేస్తున్నాయనే నమ్మకంతోనే కాంగ్రెస్‌లో చేరిన్నట్లు కుంచం శివకుమార్ గుప్తా చెప్పారు. మాజీ మంత్రి, ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, పీఆర్ చాంబర్స్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి, దేవర సమతారెడ్డి, చేవెళ్ల మాజీ సర్పంచ్ బండారు శైలజాఆగిరెడ్డి, నాయకులు శ్రీనివాస్, రఘువీర్‌రెడ్డి ,మాణిక్యరెడ్డి, ఉన్నారు.


కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న కుంచం శివకుమార్‌గుప్తా

శిథిలావస్థలో కొన్ని.. వృథాగా మరిన్ని

● కొందుర్గులోని ప్రభుత్వ భవనాల పరిస్థితి

కొందుర్గు, ఫిబ్రవరి 25 : మండలంలోని ప్రభుత్వ భవనాలు కొన్ని శిథిలావస్థకు చేరుకోగా, మరికొన్ని వృథాగా ఉన్నాయి. బస్టాండ్ వెనక రేకుల గోదాంను గతంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వినియోగించుకోగా ప్రస్తుతం అది నిరుపయోగంగా ఉంది. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని ప్రభుత్వ భవనాలు కూడా వృథాగా ఉన్నాయి. ఈ కార్యాలయ పాత భవనాన్ని 1959లో నిర్మించారు. దాంట్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కొనసాగించేవారు. కొందుర్గు నూతన మండలంగా ఏర్పడడంతో, మండల పరిషత్ కార్యాలయానికి ఈ భవనాన్ని కేటాయించి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మరో చోటుకు మార్చారు. కొంత కాలం తర్వాత పక్కనే ఉన్న మరో భవనంలోకి మార్చారు. ఇక్కడ సిబ్బందికి సరిపడా గదులు లేకపోవడంతో కొరత ఏర్పడింది. 2021లో రూ.కోటితో మండల పరిషత్ నూతన భవనాన్ని నిర్మించగా దాంట్లోకి మార్చారు. దీంతో శిథిలావస్థలో ఒకటి ఉండగా మరోటి వృథాగా మిగిలింది. ఈ కార్యాలయం ఆవరణలో సిబ్బంది కోసం గతంలో నిర్మించిన గదులు నిరుపయోగంగా మిగిలాయి. రెండు గదుల్లో ప్రభుత్వ పాల కేంద్రాలను నిర్వహిస్తున్నారు. దాని పక్కనే ఉన్న మరో గది శిథిలావస్థకు చేరుకుంది. బాలుర బీసీ వసతి గృహం ముందున్న మరో గది నిరుపయోగంగానే ఉంది. షాద్‌నగర్-పరిగి రోడ్డు ప్రక్కన ఉన్న గోదాంలో గతంలో వ్యవసాయ కార్యాలయాన్ని నిర్వహించగా, కొన్నేళ్ల తరువాత మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని ఒక గదిలోకి మార్చారు. దీంతో గోదాం వృథాగా మారింది. రైతువేదికలు ఉపయోగంలోకి వచ్చాక వ్యవసాయాధికారులు అక్కడి నుంచే విధులు నిర్వహిస్తున్నారు. దీంతో ఈ గది కూడా ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. దీని పక్కనే గతంలో గృహనిర్మాణ శాఖ ఆధ్వర్యంలో మోడల్ గదిని నిర్మించారు. అది కూడా ఉపయోగంలో లేదు. కొత్త మండల పరిషత్ కార్యాలయం ముందున్న పాత భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీన్ని కూల్చి, కొత్త మండల పరిషత్ కార్యాలయానికి రహదారిని నిర్మించాలని, వృథాగా ఉన్న సిబ్బంది గదులకు కొద్దిగా మరమ్మత్తులు చేసి, వినియోగంలోకి తేవాలని మండల వాసులు కోరుతున్నారు.


స్టోర్ రూంగా మారిన మండల పరిషత్ కార్యాలయ పాత భవనం


వృథాగా గృహనిర్మాణ శాఖ గృహం, వ్యవసాయాధికారి కార్యాలయం

ఉన్నతాధికారులకు తెలిపాం

మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న సిబ్బంది గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. శిథిలాస్థకు చేరిన మండల పరిషత్ పాత భవనాన్ని కూల్చివేచేసేందుకు ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. అనుమతి వచ్చిన వెంటనే దాన్ని నేలమట్టం చేయిస్తా.


ఆంజనేయులు, ఎంపీడీవో, కొందుర్గు.

నిస్వార్థంగా సమాజ సేవచేయాలి

చేవెళ్ల, ఫిబ్రవరి 25 : మానవాళికి నిస్వార్థంగా సేవ చేయాలనే సందేశాన్ని బాబా హరదేవ్ సింగ్‌జీ మహారాజ్ అందించారని సంత్ నిరంకారి బ్రాంచ్ సభ్యులు అన్నారు. ఆయన చూపించిన మార్గంలో ప్రతి ఒక్కరు నడుచుకోవాలని వారు స్పష్టం చేశారు. బాబా హరదేవ్‌సింగ్ మహారాజ్ జన్మదినం సందర్భంగా ఆదివారం పట్టణ కేంద్రంలో సంత్ నిరంకారి బ్రాంచ్, ముఖీ సంయోజక్ మాణిక్యప్రభు మహాత్మ ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం పుష్కరిణి ఆవరణలో స్వచ్ఛనీరు, స్వచ్ఛమనసు సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. పుష్కరిణి ఆవరణలో ఉన్న పిచ్చిమొక్కలు, చెత్తచెదారాన్ని తొలగించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బండారు శైలజాఆగిరెడ్డి, సేవా సమితి సభ్యులు తదితరులు ఉన్నారు.


స్వచ్ఛనీరు, స్వచ్ఛమనసు కార్యక్రమంలో సంత్ నిరంకారి బ్రాంచ్ సభ్యులు

సేవాలాల్ సేవలు మరువలేనివి


సేవాలాల్ జయంతి వారోత్సవాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

- ఆమనగల్లులో భారీ ర్యాలీ
- పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

ఆమనగల్లు , ఫిబ్రవరి 25 : సమాజానికి సేవాలాల్ అందించిన సేవలు మరువలేనివని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. గిరిజనుల ఆరాధ్యులు సంత్ సేవాలాల్ జయంతి వారోత్సవాలు ఆమనగల్లు పట్టణంలో ఆదివారం సేవాలాల్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సేవాలాల్ ఘాట్ నుంచి జాతీయ రహదారి మీదుగా గిరిజనులు భారీ ర్యాలీ నిర్వహించారు. సేవాలాల్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన జయంతి వారోత్సవాలలో వారు పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సేవాలాల్ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తూ గిరిజన జాతి ఉద్ధరణకు పెద్దపీట వేస్తోందని చెప్పారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ అనురాధపత్యానాయక్, మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దశరథ్‌నాయక్, సీఐ విజయ్ కుమార్, ఎస్ఐ బల్‌రామ్‌నాయక్, గిరిజన సంఘాల నాయకులు కృష్ణనాయక్, రవీందర్ నాయక్, అమర్‌సింగ్, పంతూనాయక్, శ్రీను నాయక్, రమేశ్‌నాయక్, శంకర్‌నాయక్, సురేశ్ నాయక్, రాంజానాయక్, సుమన్‌నాయక్, జైపాల్‌నాయక్, మల్లేశ్‌నాయక్, గణేశ్‌నాయక్, లక్ష్మీ, లచ్చిరామ్, బుజ్జి, స్వప్న, విజయ్‌రాథోడ్, చందు, హరి, గోపి, రాజేశ్, ప్రకాశ్, రాజు, కుమార్, మండల పరిధిలో గిరిజనులు, గిరిజన ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పదిలో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ
- ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు

చౌదరిగూడ, ఫిబ్రవరి 25 : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదోతరగతి విద్యార్థులు పబ్లిక్‌పరీక్షల్లో వందశాతం ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలలకు ఇతర పాఠశాలల నుంచి టీచర్లను సర్దుబాటు చేసి విద్యార్థులకు విద్యాబోధన సాగేలా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే సిలబస్ పూర్తిచేసి రివిజన్ పాఠాలు చెబుతూనే, ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ అర్థంకాని పాఠ్యాంశాలలో సందేహాలను నివృత్తి చేస్తూ ఉత్తీర్ణతశాతం పెంచడం కోసం ఉపాధ్యాయులు విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో నవంబరు 1 నుంచి ఈ ప్రత్యేక తరగతులు ప్రారంభించారు. విద్యార్థులు వివిధ సబ్జెక్టుల్లో పట్టు సాధించేలా శ్రద్ధ తీసుకుంటున్నారు. చౌదరిగూడలోని పెద్ద ఎల్కిచర్ల, ఎదిర, ఇంద్రానగర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, లాల్‌పహాడ్ కేజీబీవీ పాఠశాలలో మొత్తం 245 మంది విద్యార్థులు పదోతరగతి పబ్లిక్ పరీక్షలు రాసేందుకు సిద్ధమవుతున్నారు.

ఉత్తమ ఫలితాల కోసం ప్రత్యేక కార్యాచరణ

పదోతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు ఉత్తమ ఫలితాలను సాధించడం కోసం పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణను రూపొందించింది. ప్రభుత్వం సూచించిన టైంటేబుల్ ప్రకారం ఉదయం ఒక ఉపాధ్యాయుడు, సాయంత్రం మరొకరు తరగతులు నిర్వహిస్తూ, విద్యార్థులను ఎ, బీ, సీ గ్రూపులుగా విభజించి సులువుగా అర్థమయ్యేలా బోధిస్తున్నారు. విద్యార్థులకు వివిధ సబ్జెక్టుల్లో అవగాహన కల్పించేందుకు రోజువారి పరీక్షలు నిర్వహిస్తున్నారు. వారు చేసే తప్పులను వివరించి, పునరావృతం కాకుండా చూస్తున్నారు. తెల్లవారుజామునే ఫోన్‌చేసి నిద్రలేపి చదివేలా ప్రోత్సహిస్తూ, వాట్సప్ గ్రూపుల ద్వారా సందేహాలను నివృత్తి చేస్తున్నారు. వారి ప్రతిభను తల్లిదండ్రులకు తెలియజేస్తున్నారు.


ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులు

వెనుక బడిన విద్యార్థులకు వరం

తరగతి గదిలో ఉపాధ్యాయులు బోధనకే పరిమితమవుతారు. దాంతో విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధకు అవకాశం ఉండదు. దీంతో చురుకైన విద్యార్థులు మాత్రమే ముందజ వేస్తారు. వెనుకబడిన విద్యార్థులు ఇబ్బంది పడుతుంటారు. అలాంటి వారికి ఈ ప్రత్యేక తరగతులు వరంగా మారాయి. వారికి ఉన్న సందేహాలను ఈ క్లాసుల్లో ఉపాధ్యాయులు నివృత్తి చేస్తున్నారు. ప్రధానంగా గణితం, భౌతిక, జీవశాస్త్రం, ఇంగ్లీష్‌లో విద్యార్థులకు వస్తున్న సందేహాలను ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకొంటున్నారని ప్రధానోపాధ్యాయులు చెబుతున్నారు.

గణితంలో వందశాతం మార్కులు సాధిస్తా



గణితంలో వందశాతం మార్కులు సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నా. ఈ ప్రత్యేక తరగతుల్లో ఉపాధ్యాయుల వద్ద సందేహాలు నివృత్తి చేసుకుంటున్నా. రేఖీయ సమీకరణాలు, త్రికోణమితి, సిద్ధాంతాలు, శ్రేణులు, బహుపదులపై ఎక్కువ సందేహాలు తీర్చుకుంటున్నా.

స్వాతి, విద్యార్థిని, జడ్పీహెచ్ఎస్, చౌదరిగూడ

తికమక పెడుతున్న భౌతిక శాస్త్రం



భౌతికశాస్త్రం లోని కొన్ని అంశాలు తికమక పెడుతున్నాయి. ఈ ప్రత్యేక తరగతులు అన్ని సందేహాలను నివృత్తి చేసుకోవడానికి ఉపయోగపడుతున్నాయి. కష్టపడి మంచి మార్కులు సాధిస్తా.

నందీశ్వరి, విద్యార్థిని, జడ్పీహెచ్ఎస్, పెద్దఎల్కిచర్ల

గణితంలో మెలకువలు నేర్పుతున్నా



గణితంలోని వివిధ అధ్యాయాల్లోని కఠినమైన లెక్కలను కూడా విద్యార్థులు సులభంగా చేసేలా ప్రత్యేక తరగతుల్లో మెలకువలు నేర్పుతున్నా. వారిని బృందాలుగా ఏర్పాటు చేసి, మంచి మార్కులు తెచ్చుకోవడానికి అవకాశం ఉన్న అంశాలపై ఈ ప్రత్యేక తరగతుల్లో అవగహన కల్పిస్తున్నా.

నాగేశ్వర్‌రావు, గణిత ఉపాధ్యాయుడు, జడ్పీహెచ్ఎస్, చౌదరిగూడ

సులభ పద్ధతిలో బోధన



భౌతికశాస్త్రం అనగానే విద్యార్థుల్లో ఎక్కువ భయం ఉంటుంది. వారిలో ఆందోళనను తొలగించి, ఎక్కువ మార్కులు తెచ్చుకునేలా సులభ పద్ధతుల్లో మెలకువలు నేర్పిస్తున్నా. కటకాల్లో వక్రీకరణ, లక్షణాలపై విద్యార్థులు ఎక్కువ సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. వాటిని చక్కగా వివరించి వారిలో ధైర్యం నింపుతున్నా.

ఎస్ రత్నం, భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు, జడ్పీహెచ్ఎస్, పెద్దఎల్కిచర్ల

317 జీవోపై మంత్రివర్గ ఉపసంఘం హర్షణీయం

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- కాంగ్రెస్ మాట ఇస్తే తప్పదు

షాద్‌నగర్, ఫిబ్రవరి 24: బీఆర్ఎస్ ప్రభుత్వం ఆదరబాదరగా, అశాస్త్రీయంగా తీసుకొచ్చిన 317 జీవోపై రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించడం హర్షణీయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే తప్పదని చెప్పారు. ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 317 జీవో వల్ల ఉద్యోగులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ముఖ్యంగా ఉపాధ్యాయులు తమ కుటుంబాలకు దూరంగా ఉంటూ ఎన్నో బాధలు పడుతున్నా గత ప్రభుత్వం వారి సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు. ఈ జీవో గురించి ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకురాగా ఆయన వెంటనే స్పందించి మంత్రులు దామోదర రాజనర్సింహా, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లతో కూడిన త్రిసభ్య కమిటీ వేశారని చెప్పారు. 317 జీవోతో ఉద్యోగులు పడుతున్న సమస్యలపై ఈ కమిటీ సమగ్రంగా అధ్యయనం చేయడంతో పాటు, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని సీఎంకు నివేదిక అందజేస్తుందని తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరం ముగిసేలోపే కమిటీ నివేదిక అందజేసే అవకాశం ఉందన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

అశాస్త్రీయంగా కొత్త జిల్లాల ఏర్పాటు

కొత్త జిల్లాల ఏర్పాటులోనూ బీఆర్ఎస్ ప్రభుత్వ డొల్లతనం బయట పడుతోందని, అశాస్త్రీయంగా జిల్లాలను ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే ఆరోపించారు. ఎలాంటి వసతులు లేని మారుమూల గ్రామాలను పంచాయతీలుగా మార్చిందని విమర్శించారు. దీన్ని సరిదిద్దుకోవడం కోసమే నాటి ప్రభుత్వం 317 జీవో తెచ్చి స్థానికత అంశాన్ని తెరపైకి తెచ్చి ఉపాధ్యాయులను మానసికవేధనకు గురి చేసిందని చెప్పారు. గత రెండున్నర సంవత్సరాలుగా వారు పడుతున్న బాధలు వర్ణనాతీతమన్నారు. సబ్ కమిటీ వీలైనంత త్వరగా అధ్యయాన్ని పూర్తి చేసి నివేదిక అందిస్తుందని అభిప్రాయపడ్డారు.

పర్యావరణ పరిరక్షణకు నాయకత్వం వహించాలి

- ప్రొఫెసర్ ఉపేందర్‌రెడ్డి

కడ్తాల్ , ఫిబ్రవరి 25 : విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు నాయకత్వం వహించాలని, సమాజసేవలో భాగస్వామ్యం కావాలని ప్రొఫెసర్ ఉపేందర్‌రెడ్డి, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంస్థ చైర్మన్ (సీజీఆర్) లీలాలక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. సమాజానికి మేలు చేసే కార్యక్రమాలను ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా గుర్తించి ముందుకుసాగాలని చెప్పారు. కడ్తాల మండలం అన్మాస్‌పల్లి సమీపంలోని ది ఎర్త్ సెంటర్‌లో సీజీఆర్, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన లీడ్ ఎర్త్ లీడర్స్ శిక్షణ కార్యక్రమం ఆదివారం సాయంత్రం ముగిసింది. సీజీఆర్ ఫౌండర్ లక్ష్మారెడ్డి అధ్యక్షతన జరిగిన ముగింపు కార్యక్రమానికి ఉపేందర్‌రెడ్డి, లీలారెడ్డి, డీఎస్పోలు బానుప్రకాశ్, శ్రీనివాసరావు, శ్రీనివాసులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. మహబూబ్‌నగర్, నారాయణపేట, రంగారెడ్డి జిల్లాలకు చెందిన శిక్షణ పొందిన విద్యార్థులకు ఈ సందర్భంగా వారు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పర్యావరణ శాస్త్ర వేత్తలు డాక్టర్ నక్కసాయి భాస్కర్‌రెడ్డి పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకం, వర్షపు నీటి సంరక్షణ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఉపేందర్‌రెడ్డి

ఈ సందర్భంగా లీలాలక్ష్మారెడ్డి, ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై మానవ మనుగడ ఆధారపడి ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉమామహేశ్వర్‌రెడ్డి, మల్లేశం, భాల్‌రాజ్, నర్సింహులు, మాధవి, యమున, జయప్రద, వెంకటేశ్, రజనీకాంత్, వీరేశ్, లక్ష్మీప్రసన్న, సుష్మ, నాగేశ్, పాల్గొన్నారు.

చెరుకు రసం.. ఆరోగ్యకరం

- రోజుకో గ్లాసు తాగితే ఎంతో మేలు

పరిగి, ఫిబ్రవరి 25 : వేసవికాలం వచ్చిందంటే చాలు ఏ చౌరస్తాలో చూసినా చెరుకురసం అమ్మే బండ్లు కనిపిస్తాయి. మండుటెండ నుంచి కాస్త ఉపశమనం పొందేందుకు చెరుకురసాన్ని తాగేందుకు అందరూ ఆసక్తి కనబరుస్తారు. ఇది దాహార్తిని తీర్చడమే కాకుండా ఆరోగ్యానికి కూడా చక్కని మేలు చేస్తుంది. ఎంతగానో దోహదపడుతుంది.

మూత్ర సమస్యలను నివారిస్తుంది

చెరుకురసం ఆరోగ్యానికి ఏ విధంగా ఉపకరిస్తుందో చిట్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఇది శక్తిదాయకంగా ఉపకరిస్తుంది. జీర్ణవ్యవస్థ బాగా పనిచేసేలా చేస్తుంది. రక్తంలో చక్కరశాతం తగ్గినప్పుడు, కళ్ళు తిరుగుతున్నట్లు అనిపించినప్పుడు చెరుకురసం తాగితే ఉపశమనం పొందవచ్చు. రోజూ ఒక గ్లాసు తాగితే ఎంతో మంచిది. చెరుకురసంలో కాస్త నిమ్మరసం కలిపి తాగితే చాలామంచిది. ఇందులో ఉత్తమ రకం ఐరన్ లభ్యమవుతుంది. అది త్వరగా కలిసిపోయి రక్తహీనతను దూరం చేస్తుంది. చెరుకురసంలో ప్రొటీన్లు, మంచి పోషకవిలువలు ఉంటాయి. ఇందులో ఎక్కువ ఇనాంసిటల్ ఉండడంతో శరీరంలోని రోగనిరోధక శక్తిని పెంచి చాలా బాగా పని చేస్తుంది. చెరుకురసాన్ని బాగా మరిగించి తాగితే మలబద్ధకం సమస్య ఉండదు. అల్లం కలుపుకుని రసం తాగినా, చెరుకు నమిలినా గొంతు గరగర నుంచి ఉపశమనం పొందవచ్చు. చెరుకురసం పచ్చకామెర్ల వ్యాధిగ్రస్తులకు లాభాదాయకంగా


మొబైల్ చెరుకురసం బండి

పని చేస్తుంది. ఇది ఆ వ్యాధిని సమూలంగా నాశనం చేస్తుంది. వాంతులు అవతునప్పటికి దీనిని తాగితే ప్రశాంతత లభిస్తుంది. ఈ రసంలో ఉసిరిరసం, దానిమ్మ, తేనె కలిపి తాగితే వివిధ వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చు. అంతేకాకుండా రక్తంవృద్ధికి దోహదపడుతుంది. ఇన్ని ప్రయోజనాలు ఉన్న చెరుకురసాన్ని రోజుకో గ్లాసు తాగితే మంచిది. మరి ఇక నుంచి తాగేద్దాం.!



\- డాక్టర్ ప్రవీణ్‌కుమార్ చిట్యాల ఆరోగ్య కేంద్రం, పరిగి


ఊరూరా బెల్ట్ షాపులు

- విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు
- పేదల రెక్కల కష్టాన్ని కాజేస్తున్న అక్రమార్కులు

యాచారం, ఫిబ్రవరి 25 : గ్రామాల్లో బెల్టు షాపులను అరికట్టేందుకు అధికారుల చర్యలు లేక మద్యం దందా జోరుగా సాగుతోంది. ఒక్కో గ్రామంలో ఐదు నుంచి 15 వరకు బెల్టుషాపులు నడుస్తున్నాయి. మద్యం అమ్మకాలను పెంచేందుకు అధికారులే బెల్టుషాపులను ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలొస్తున్నాయి. మొండిగౌరెల్లిలో బెల్టుషాపు నిర్వాహకులు ఎమ్మార్పీకే మద్యం సీసాలు అని వాట్సాప్‌లో ప్రచారం చేయిస్తున్నారంటే వారి వెనుక ఉన్న బలమేంటో అర్థమవుతోందని గ్రామస్తులు అంటున్నారు. కాగా మహిళలే బెల్టుషాపులను నిర్వహిస్తున్నారని, నాయకుల అండదండలతోనే ఇదంతా జరుగుతోందనే ఆరోపణలొస్తున్నాయి.

పదుల సంఖ్యలో బెల్టు దుకాణాలు..

గ్రామాల్లో మద్యం విచ్చలవిడిగా దొరుకుతుండడంతో యువకులు మద్యానికి బానిసవుతున్నారని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నందివనపర్తిలో 15, మంతన్‌గౌరెల్లిలో 12, చిన్నతూండ్లలో 8, కుర్మిద్దలో 4, తమ్మలోనిగూడలో 6, యాచారంలో 2, మల్కీజ్‌గూడలో 5, మొండి గౌరెల్లిలో 4, చౌదర్‌పల్లిలో 6, గడ్డమల్లాయగూడలో 7 చొప్పున బెల్టు షాపులున్నాయి. మేడిపల్లి మద్యం దుకాణం నుంచి పల్లెచెల్కతండా, సరికొండ బెల్ట్‌షాప్‌కు మద్యం రవాణా చేస్తున్నారు. బెల్ట్‌షాపుల్లో రాయల్ స్టాగ్ క్వార్టర్ రూ.240(ఎమ్మార్పీ 192)కి, చీప్ లిక్కర్ రూ.120(ఎమ్మార్పీ 90)కి, లైట్ బీర్ రూ.150(ఎమ్మార్పీ 120)కి అమ్ముతున్నారు. ప్రతీ సీసాపై 30 నుంచి 40 రూపాయల వరకు ఎక్కువ తీసుకుంటున్నారు. మద్యానికి అలవాటు పడి


ఓ బెల్టుదుకాణంలో స్వాధీనం చేసుకున్న మద్యం ఫైల్

యువకులు డబ్బుల కోసం చోరీలకు పాల్పడుతున్నారు. మద్యం మత్తులో బైక్‌లను అతి వేగంగా నడుపుతూ ప్రమాదాలకు కారకులవుతున్నారు. బెల్టుషాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాల్సిన ఎక్సైజ్ శాఖ వారి జోలికే వెళ్లడం లేదు. ఊర్లోనే మద్యం దొరుకుతుండడంతో పేదలు కూలి డబ్బంతా మద్యానికే ఖర్చు చేస్తున్నారు. ఇదిలా ఉంటే మొండిగౌరెల్లిలో ఎమ్మార్పీకే మద్యం విక్రయం అని వాట్సాప్‌లో ప్రచారం చేసిన బెల్టుషాపు నడుపుతున్న వ్యక్తిని బైండోవర్ చేశామని పోలీసులు చెప్పారు. బెల్టుషాపులు అడ్డుకట్టుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

బెల్టు షాపులపై ఆరా తీస్తున్నాం



ఏ గ్రామంలో ఎన్ని బెల్టు దుకాణాలున్నాయో పంచాయతీ కార్యదర్శులతో ఆరా తీస్తున్నాం. పూర్తి సమాచారం రాగానే వివరాలను ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులకు తెలియజేస్తాం. బెల్టు దుకాణాలు మూయించేందుకు కృషి చేస్తాం.

\- నరేందర్‌రెడ్డి, ఎంపీడీవో, యాచారం

నానక్‌రాంగూడలో భారీ అగ్నిప్రమాదం

- సకాలంలో అధికారులు
- స్పందించడంతో తప్పిన పెనుముప్పు

రాయదుర్గం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నానక్‌రాంగూడ ప్రధాన రహదారిలో ఎస్‌బీఐ బ్యాంకు ఎదురుగా రోడ్డు పక్కన ఆదివారం రాత్రి 8గంటల సమయంలో ఒక్కసారిగా పెద్ద అగ్నిప్రమాదం జరిగింది. సుమారుగా ఐదు మీటర్ల ఎత్తు వరకు మంటలు ఎగసిపడటంతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురయ్యారు. స్థానికులు వెంటనే గచ్చిబౌలి పోలీసులకు, మాదాపూర్ ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. దీంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. ఈ అగ్నిప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అయితే రోడ్డుపక్కన భూగర్భగ్యాస్‌పైపులైన్ పైన కొంతకాలంగా చుట్టుపక్కల ఉన్న ఫుట్‌పాత్ వ్యాపారులు చెత్తవేశారు. గుర్తుతెలియని వ్యక్తులకు ఆ చెత్తకు నిప్పంటించడం వల్ల ఈ ప్రమాదం జరిగి ఉంటుందని స్థానికులు తెలిపారు. ఇంకా పూర్తి వివరాలను తెలుసుకుని అగ్నిప్రమాదానికి గల కారణాలపై విచారిస్తామని ఇన్‌స్పెక్టర్ జేమ్స్‌బాబు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.


ఎగసిపడుతున్న మంటలు

కుమారుడిని హతమార్చిన తండ్రి

- డబ్బుల విషయంలో ఇద్దరి మధ్య లొల్లి
- కొడుకు కనిపించడం లేదంటూ నాటకం

శామీర్‌పేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆస్తి అడిగిన కుమారుడిని అతి దారుణంగా హత్య చేశాడు ఓ తండ్రి. ఆపై.. ఆధారాలు లేకుండా చేసేందుకు మృతదేహాన్ని బావిలో పడేశాడు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలంలో జరిగిన ఈ దారుణం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. లాల్‌గడి మలక్‌పేట గ్రామానికి చెందిన కొరివి రాంచందర్, కొరివి మంజుల.. తమ పెద్ద కుమారుడు నరేశ్(27) కనిపించడంలేదంటూ తుర్కపల్లిలోని జీనోమ్ వ్యాలీ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులకు ఈనెల 11న ఆస్తి వాటా, డబ్బుల విషయంలో తండ్రి రాంచందర్, కుమారుడు నరేశ్ మధ్య గొడవ జరిగినట్లు తెలిసింది. ఈ క్రమంలో ఆస్తిని నరేశ్‌కు పంచివ్వడానికి రాంచందర్ అంగీకరించాడు. ఆ తర్వాత తనకు రూ.పది వేలు కావాలని నరేశ్ తండ్రిని అడిగాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. అయితే డబ్బులిస్తానని తండ్రి రాంచందర్ కొడుకు నరేశ్‌ను నమ్మించి ఈనెల 11న లాల్‌గడి మలక్‌పేట పరిధిలోని మర్లల్ల బావి సమీపంలోకి తీసుకెళ్లి మద్యం తాగించాడు. మద్యం మత్తులో నరేశ్ నేలపై పడిపోవడంతో రాంచందర్ నరేశ్ మెడపై కాలుతో బలంగా తొక్కాడు. దీంతో అతడు ప్రాణాలు కోల్పోయాడు. అనంతరం మృతదేహాన్ని రాంచందర్ దగ్గరలో ఉన్న బావిలో పడేశాడు. పోలీసుల విచారణలో అసలు విషయం తెలిసింది. నరేశ్‌కు భార్య, ఏడాదిన్నర బాబు ఉన్నారు.



విలపిస్తున్న కుటుంబసభ్యులు, ఇన్‌సెట్‌లో హత్యకు గురైన నరేశ్(ఫైల్)

ఘనంగా మహిళాశక్తి సమ్మేళనం

శంషాబాద్, ఫిబ్రవరి 25 : మహిళలు మహాశక్తివంతులని, మహిళా శక్తిని మరింతగా పెంపొందించడానికి రాష్ట్రీయ సేవికా సమితి అవగాహన కార్యక్రమాలు చేపడుతోందని ప్రముఖ గాయని పద్మశ్రీ డాక్టర్ శోభారాజు అన్నారు. శంషాబాద్ పట్టణ కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం సాయంత్రం రాష్ట్రీయ సేవికా సమితి భాగ్యనగర్ శాఖ ఆధ్వర్యంలో మహిళాశక్తి సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. భారతీయ మహిళలు అంటే వంటింటికే పరిమితం అనే భావన చాలా మందిలో ఉందన్నారు. మహిళలకు ఏమీతెలియదు, ఏమీరాదనే భావనను మహిళలపై రుద్దారన్నారు. మహిళలకు ఏమీ తెలియకపోతే పెళ్లిలో నూతన దంపతులకు వశిష్ఠుడి భార్య అరుంధతి (నక్షత్రాన్ని)ని ఎందుకు చూపిస్తున్నారని ప్రశ్నించారు. సమాజంలో ఉన్న ప్రచారంవల్లే మహిళలు ఏం తెలియని వారేమీ కాదన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థినులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎల్. ఉజ్వల, డాక్టర్ కళ్లెంస్వప్న, జీ. రమాదేవి, గోవర్దనం ప్రసన్నలక్ష్మి తో పాటు వీహెచ్‌పీ నాయకుడు కొత్తశ్రీనివాస్, పలువురు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శోభారాజు

మేడ్చల్ మెట్రోను ఫేజ్-2లో చేర్చాలి

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మేడ్చల్‌కు మెట్రోను ఫేజ్-2లో చేర్చాలని మేడ్చల్ మెట్రో సాధన సమితి సభ్యులు సుచిత్ర జంక్షన్‌లో ధర్నా నిర్వహించారు. ధర్నాకు మద్దతుగా బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్‌సింహారెడ్డి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా భరత్ సింహారెడ్డి, మేడ్చల్ మెట్రో సాధన సమితి సభ్యులు మాట్లాడుతూ ఫేజ్-2లో మేడ్చల్‌ను చేర్చకుంటే ఈ ప్రాంత ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, గచ్చిబౌలికి, ఉప్పల్, ఎల్‌బీనగర్‌కి, శంషాబాద్‌కు మెట్రో వస్తుంది కానీ, ఉత్తరాన ఉన్న మేడ్చల్ ప్రాంతానికి మెట్రో లేకపోవడం చాలా బాధాకరం అన్నారు. మేడ్చల్ ప్రాంతానికి మెట్రో ను ప్రభుత్వం ఇవ్వాలని మూడు నెలల నుంచి మేడ్చల్ మెట్రో సాధన సమితి సభ్యులు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో మహేందర్‌రెడ్డి, సంపత్ రెడ్డి, జార్జ్, ఉదయ్ గుప్త, రాజారెడ్డి, అరవిందరావు, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న మేడ్చల్ మెట్రో సాధన సమితి సభ్యులు


మల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన రాజశేఖర్‌రెడ్డి

కాంగ్రెస్‌లోకి పొల్కంపల్లి సొసైటీ చైర్మన్

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 25 : ఇబ్రహీంపట్నం పరిధి పొల్కంపల్లి సహకార సంఘం చైర్మన్ చిన్నగంట రాజశేఖర్ రెడ్డితోపాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు ఆదివారం తొర్రూరులోని క్యాంపు కార్యాలయంలో ఎమెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేకూరుతుందని భావించి బీఆర్ఎస్‌ను వీడి ఆ పార్టీలో చేరినట్లు రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ వైస్‌చైర్మన్ వేముల లక్ష్మణ్ రావు తదితరులున్నారు.



కడ్తాలలో కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

కేటీఆర్‌కు నాయకుల ఘన స్వాగతం

కడ్తాల్, ఫిబ్రవరి 25: బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్‌కు కడ్తాల మండల కేంద్రంలో ఘన స్వాగతం లభించింది. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొనడానికి వెళ్తున్న కేటీఆర్‌కు స్థానిక జడ్పీటీసీ దశరథ్‌నాయక్ నివాసం వద్ద బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజ్, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, జడ్పీటీసీలు దశరథ్‌నాయక్, ఉప్పల వెంకటేశ్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, వైస్‌ఎంపీపీ ఆనంద్, మాజీ మార్కెట్ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్ రెడ్డిలు కేటీఆర్‌ను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ శ్రేణుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పార్లమెంట్ ఎన్నికలకు సమాయత్తం కావాలని సూచించారు. ఎంపీటీసీల సంఘం జిల్లా కార్యదర్శి బొప్పిడి గోపాల్, ఎంపీటీసీలు లచ్చిరామ్‌నాయక్, ప్రియ, మంజుల, రైతు సమన్వయ సమితి మండలాధ్యక్షుడు జోగు వీరయ్య, బీఆర్‌ఎస్ నాయకులు కడారి రామకృష్ణ, సేవ్యానాయక్, రాజేందర్‌గౌడ్, చంద్రమౌళి, రమేశ్, మంగళిపల్లి నర్సింహ్మా, జంగయ్య, సాయిలు, అంజి, చంద్రశేఖర్ రెడ్డి, సుభాష్, మాదారం మహేశ్, తదితరులు పాల్గొన్నారు. ఆమనగల్లులో జడ్పీటీసీ అనురాధపత్యానాయక్, నాయకులు సయ్యద్ ఖలీల్, గుత్తి బాలస్వామి, శ్రీను నాయక్, పంతూనాయక్, రమేశ్ నాయక్, తదితరులు కేటీఆర్‌కు స్వాగతం పలికారు.

కార్యకర్తలకు అండగా బీఆర్‌ఎస్



కార్తీక్‌రెడ్డి కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 25 : రాష్ట్రంలో అధికారంలో లేకపోయినా పదేళ్ల పాటు బీఆర్‌ఎస్ పార్టీకి, తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య భరోసా ఇచ్చారు. ఎవరూ అధైర్యపడవద్దని ఆయన సూచించారు. మండల పరిధిలోని అజీజ్‌నగర్ గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్‌ఎస్ యువనాయకుడు గడ్డం కార్తీక్‌రెడ్డి తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నాడు. గతేడాది ఆగస్టులో ఆయన మండల పరిధిలోని చిన్నషాపూర్ చౌరస్తా వద్ద ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. దాంతో అజీజ్‌నగర్‌లోని కార్తీక్‌రెడ్డి నివాసానికి ఆదివారం ఎమ్మెల్యే వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. బీఆర్‌ఎస్ సభ్యత్వం కలిగి ఉండడంతో పార్టీ తరఫున అందజేసే రూ.2లక్షల బీమా చెక్కును అందజేశారు. ప్రతీ ఒక్కరికి పార్టీ అండగా ఉంటుందని ఆయన సూచించారు. నాయకులను, కార్యకర్తలను అధిష్టానం కంటికి రెప్పలా కాపాడుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్‌ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు గడ్డం వెంకట్‌రెడ్డి, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

షాద్‌నగర్, ఫిబ్రవరి 25 : తెలంగాణ ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ షాద్‌నగర్ యూనిట్ ఆధ్వర్యంలో ఈనెల 27న ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు అసోసియేషన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. మంగళవారం ఉదయం 10 గంటలకు పెన్షనర్ల భవనంలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, అవేర్ సంస్థ చైర్మన్ మాధవన్‌తో పాటు కామినేని ఆస్పత్రి వైద్యులు, ఆయుర్వేదిక్, యునాని, హోమియోపతి వైద్యులు పాల్గొని వివిధ రకాల పరీక్షలు చేస్తారని అసోసియేషన్ పేర్కొంది.

కాస్ట్యూమ్ జ్యువెల్లరీలో ఉచిత శిక్షణ

శంషాబాద్, ఫిబ్రవరి 25 : మండల పరిధిలోని ముచ్చింతల్ స్వర్ణభారత్ ట్రస్టు, జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో కాస్ట్యూమ్ జ్యువెల్లరీలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్వర్ణభారతి ట్రస్టు కోఆర్డినేటర్ గోపీచంద్ తెలిపారు. ఈ నెల 28న స్వర్ణభారతి ట్రస్టు ఆవరణలో శిక్షణ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. 13 రోజుల పాటు జరిగే శిక్షణకు హాజరయ్యే అభ్యర్థులకు ఉచితంగా భోజనం, వసతి ఏర్పాటు చేశామన్నారు. 19 నుంచి 45 సంవత్సరాల వయస్సు కలిగిన నిరుద్యోగులు ఆధార్, రేషన్‌కార్డుతో పాటు 3 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాలకు చెందినవారు.. రాయడం, చదవడం తప్పనిసరిగా వచ్చినవారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

డిప్యూటీ సీఎంను కలిసిన నాయకులు

ఆమనగల్లు, ఫిబ్రవరి 25: ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి డాక్టర్ మల్లు రవిలను ఆదివారం జిల్లా కాంగ్రెస్ నాయకులు వస్పుల జంగయ్య, గుర్రం కేశవులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఖమ్మం జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో వారిని కలిసినట్లు తెలిపారు. లక్ష్మీపురంలో జరిగిన మల్లు సోదరుడు వెంకటేశ్వర్‌రావు సంస్మరణ కార్యక్రమంలో పాల్గొని నివాళి అర్పించినట్లు జంగయ్య, కేశవులు తెలిపారు.

సీఐ విజయ్‌కుమార్‌కు సన్మానం

ఆమనగల్లు, ఫిబ్రవరి 25: ఆమనగల్లు నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన విజయ్ కుమార్‌ను ఆదివారం కౌన్సిలర్ చెన్నకేశవులు మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక పోలీసు సర్కిల్ కార్యాలయంలో విజయ్ కుమార్‌ను కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలంత పోలీసులకు సహకరించాలని సీఐ కోరారు. నాయకులు శానమోని పాండు, శ్రీను, తదితరులు ఉన్నారు.



వైభవంగా శివపార్వతుల కల్యాణం

● పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తులు.. ప్రత్యేక పూజలు



షాబాద్ : శివపార్వతుల కల్యాణంలో పాల్గొన్న గ్రామస్తులు, తదితరులు

షాబాద్, ఫిబ్రవరి 25 : శివపార్వతుల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. మండల పరిధిలోని సర్దార్‌నగర్‌లో గల భ్రమరాంభ సహిత సంఘమేశ్వరస్వామి ఆలయంలో వేద పండితులు స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తలంబ్రాలను తీసుకొచ్చారు. దేవాలయం శివనామస్మరణతో మార్మోగింది. స్వామివారి కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పూజా కార్యక్రమాల్లో గ్రామస్తులు భానూరి రాంమోహన్‌గుప్తా, జగదీశ్వర్‌గుప్తా, దండు రాముగుప్తా, సరాఫ్ రమేష్ గుప్తా, సర్వం, హరీష్, శశాంక్, రాజు, కుమార్, అశోక్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చీకటి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

కందుకూరు : మండలంలోని పులిమామిడి గ్రామంలో గల చీకటి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి బ్రహ్మోత్సవాలు అట్టహాసంగా ముగిసాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆలయం ఆవరణలో సామూహిక సత్యనారాయణ వ్రతాలను నిర్వహించారు. అనంతరం నగరం నుంచి తరలించిన ఎడ్లతో పందేలు(బండలాగుడు పోటీలు) నిర్వహించారు. మొదటి బహుమతి కింద రూ.35వేలు, రెండో బహుమతి రూ.25వేలు, మూడో బహుమతి కింద రూ.15వేలు అందజేశారు. గ్రామస్తులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

దైవచింతన అలవర్చుకోవాలి

కేశంపేట : దైవచింతనతో ప్రతీ ఒక్కరిలో భక్తి భావం పెంపొందుతుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని పోమాల్‌పల్లి, కొండారెడ్డిపల్లి గ్రామ శివారులోని వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం బండ్లు తిప్పుట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎడ్ల బండిపై ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. అంతకుముందు ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చేసిన పల్లె బ్రదర్స్ ఆనంద్ కుమార్, బాలీశ్వర్‌లను వీర్లపల్లి అభినందించి సన్మానించారు. అనంతరం కొండారెడ్డిపల్లి, పోమాల్‌పల్లి గ్రామస్తులను అభినందించారు. మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, జడ్పీటీసీ తాండ్ర విశాలశ్రవణ్‌రెడ్డి, కొత్తూర్ మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గూడ వీరేశ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, శ్రీధర్‌రెడ్డి, మంజుల, రాజశేఖర్, అనుమగళ్ల రమేష్, నిదురం కృష్ణయ్య, మల్లేష్ గౌడ్, సుదర్శన్, లింగం, కుమార్‌గుప్తా, రావుల పెంటయ్య, రాములు, పర్వతాలు, వెంకటేష్, తుమ్మల గోపాల్ ముదిరాజ్ తదితరులున్నారు.



కేశంపేట : ఎడ్లబండిని తోలుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, పాల్గొన్న నాయకులు

వార్షిక వేడుకలకు రామలింగేశ్వరాలయం ముస్తాబు

ఆమనగల్లు : నేడు(సోమవారం) పట్టణంలోని అయ్యప్ప కొండ వద్దగల శ్రీ భవాన్ని రామలింగేశ్వర స్వామి ఆలయం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా వేడుకలకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఆలయ నిర్వాహకుడు రేగటి శ్రీనివాసులు ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మహాగణపతి పూజ, రుద్రాభిషేకం, గణపతిహోమం, ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి కల్యాణం కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అయ్యప్ప దేవాలయ చైర్మన్, ఎస్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము హాజరవుతున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని శ్రీను కోరారు.



విద్యార్థులతో వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్, తదితరులు

ఆత్మరక్షణకు కరాటే అవసరం

కొందుర్గు, ఫిబ్రవరి 25: ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరమని, విద్యార్థులందరూ తప్పనిసరిగా నేర్చుకోవాలని వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో న్యూమాంక్స్ కుంగ్‌ఫూ ఆధ్వర్యంలో కరాటే పోటీలు నిర్వహించారు. వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్ హాజరై మాట్లాడుతూ విద్యార్థులు తప్పని సరిగా కరాటే, కుంగ్ ఫూ వంటి ఆత్మరక్షణ విద్యలను నేర్చుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కటాస్, స్పారింగ్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. టోర్నమెంట్‌లో కొందుర్గు, షాద్‌నగర్, షాబాద్, నాగర్‌కర్నూల్, కొల్లూరులకు చెందిన బాలురు, బాలికలు పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి రాజేష్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ రమేష్, ఎస్.బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు మరువలేనివి : సీఐ

ఆమనగల్లు, ఫిబ్రవరి 25 : ప్రజారక్షణలో ప్రాణాలొదిలిన పోలీసుల అమరవీరుల కుటుంబాలకు ప్రజలంతా అండగా నిలిచి మనోధైర్యం కల్పించాలని, వారి త్యాగాలు మరువలేనివని ఆమనగల్లు సీఐ విజయ్‌కుమార్ అన్నారు. అమరుల ఆశయ సాధనకు పోలీస్ సిబ్బంది కృషి చేయాలని సూచించారు. కర్తవ్య నిర్వాహణలో అసువులుబాసిన దివంగత ఆమనగల్లు ఎస్ఐ కాసం హన్మంత్ రెడ్డి 23వ వర్ధంతి వేడుకలు ఆదివారం ఆమనగల్లు పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్ఐ బాల్‌రామ్‌నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. హన్మంత్ రెడ్డి కుటుంబ సభ్యులు, పోలీసు సిబ్బంది, హన్మంత్ రెడ్డి సోదరుడు కాసం రాంరెడ్డిలతో కలిసి సీఐ ఆయన కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పోలీసుస్టేషన్ ఆవరణలో సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. హన్మంత్ రెడ్డి సేవలను ఆయన కొనియాడారు. శాంతి భద్రతల పరిరక్షణ, సంఘ విద్రోహ శక్తులను తుదముట్టించడానికి పోలీసులకు ప్రజల సహకారం ఎంతైన అవసరమని సీఐ విజయ్‌కుమార్ అన్నారు.



హన్మంత్‌రెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు, సీఐ విజయ్‌కుమార్

కార్యక్రమంలో ఏఎస్ఐలు బాల్‌రెడ్డి, యాదయ్య, హెచ్‌సీ శ్రీనివాస్, హన్మంత్ రెడ్డి కుటుంబ సభ్యులు ముత్యాల సాయిబాబా, జ్యోతి, లక్ష్మి, దయాకిరణ్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి జస్వంత్‌సింగ్

విద్యార్థులకు సామాజిక అంశాలపై అవగాహన కల్పించాలి

● ఇబ్రహీంపట్నం కోర్టు సివిల్ జడ్జి జస్వంత్‌సింగ్

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 25: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడంతోపాటు సామాజిక అంశాలపై అవగాహన కల్పించాలని ఇబ్రహీంపట్నం కోర్టు సివిల్ జడ్జి జస్వంత్‌సింగ్ సూచించారు. శనివారం రాత్రి ఇబ్రహీంపట్నంలో మౌంట్ లిటెరాజీ కిడ్జ్ స్కూల్ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు కూడా పిల్లలకు ఎంతసేపూ చదవండి అంటూ వెంటపడకుండా.. బంధుత్వాలు, బాధ్యతలు ఏంటనేది నేర్పించాలని అన్నారు. పాఠశాలల్లో క్రీడలు, సాంస్కృతిక అంశాల్లో తర్ఫీదు ఇవ్వాలని ఆయన సలహా చేశారు. చట్టాలపై అవగాహన కల్పించాలని, విద్యార్థులు ఏ విషయంలోనైనా నిలబడి తట్టుకునే మనస్తత్వం ఉన్నప్పుడే ఉన్నతిలోకి వస్తారన్నారు. పాఠశాలలో సీబీఎస్ఈ సిలబస్‌లో బోధించడం మంచి పరిణామమని అన్నారు. కార్యక్రమంలో ఐ లెర్న్ లిమిటెడ్ నేషనల్ హెడ్ కింగ్స్ స్టన్ డిసౌజా తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఆమనగల్లు, ఫిబ్రవరి 25: ప్రజా, కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎంగళి ప్రసాద్ అన్నారు. కాంగ్రెస్ ప్రజా పాలనలో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని అన్నారు. ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన ఎంగళి ప్రసాద్‌కు ఆదివారం స్థానిక మార్కండేయ స్వామి దేవాలయ ఆవరణలో అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడు ఎంగళి బాలకృష్ణ, మున్సిపల్ వైస్‌చైర్మన్ భీమనపల్లి దుర్గయ్య, ప్రధాన కార్యదర్శి అవ్వారి శివలింగంల ఆధ్వర్యంలో సంఘం నాయకులు ప్రసాద్‌ను పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. సంఘం నాయకులు గాజుల సత్యం రాములు, అప్పం శ్రీను, చిల్వేరు వాసు, బావండ్ల భాస్కర్, పున్న శ్రీనివాస్, గుర్రం భద్రయ్య, దోర్నాల ఈశ్వరయ్య, ఎంగళి శ్రీధర్, నిరంజన్, యాదగిరి, తదితరులున్నారు.



ప్రసాద్‌ను సన్మానిస్తున్న పద్మ శాలి సంఘం నాయకులు



విలేకరులతో మాట్లాడుతున్న రాజమల్లేష్

ఆహార కల్తీపై చర్యలు తీసుకోవాలి

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 25 : ఆహార కల్తీపై ఉక్కుపాదం మోపి, హోటల్, రెస్టారెంట్ నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బట్టు రాజమల్లేష్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. నగర శివారు ప్రాంతం కావడంతో మొయినాబాద్ మండలంలో విపరీతమైన హోటళ్లు, రెస్టారెంట్లు వెలిశాయని తెలిపారు. సదరు యజమానులు నాణ్యత లేని ఆహార పదార్థాలు, అపరిశుభ్రంగా ఉన్నవాటిని ఉపయోగించి వినియోగదారులకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. దాంతో వారు అనారోగ్యం పాలవుతున్నారని అన్నారు. హోటళ్లు, రెస్టారెంట్ నిర్వాహకులు ఫుడ్ సెక్యూరిటీ హెల్త్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించి ధ్రువీకరణ పత్రాలు లేకున్నా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. దీనిపై అధికారులు మొయినాబాద్‌లోని అన్ని హోటళ్లను సందర్శించి నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నారా? లేదా? అని పరిశీలించాలని సూచించారు. అంతే కాకుండా రాజస్థాన్, బిహార్ రాష్ట్రాలకు చెందిన ముఠా టీ పౌడర్, పారాచూట్ కొబ్బరి నూనె, ఎవరెస్ట్ మసాలాలు, డిటర్జెంట్ సబ్బులు, హార్పిక్, లైజాల్, బ్రూక్‌బ్రాండ్, మారికో లిమిటెడ్, హిందూస్థాన్ యూనిలివర్ లిమిటెడ్ వంటి ప్రముఖ కంపెనీల పేరుతో నకిలీ ఉత్పత్తులను విక్రయించేందుకు గ్రామాల్లో సంచరిస్తున్నారని తెలిపారు. ప్రజలు అలాంటి వారిని గుర్తించి తగిన బుద్ధి చెప్పి పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మండలంలో గంజాయి ముఠా విపరీతంగా పెరిగిపోయిందని, పోలీసులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కోరారు. సమావేశంలో నాయకులు విజయ్‌గౌడ్, నర్సింగ్ గౌడ్, శివ తదితరులు ఉన్నారు.

ఘనంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం

కందుకూరు/యాచారం, ఫిబ్రవరి 25 : కందుకూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 1994-95లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం మండలంలోని కొత్తూరు ఫాంహౌజ్‌లో సమ్మేళనం నిర్వహించారు. అప్పటి ఉపాధ్యాయులు గోపాలకృష్ణ, వెంకటేశం, జగన్‌మోహన్‌చారి, పెంటారెడ్డి, దుర్గలత, సుదర్శన్‌లను విద్యార్థులు సన్మానించారు. అదేవిధంగా యాచారం మండలంలోని నందివనపర్తి పాఠశాలలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. గ్రామంలో 20007-08 సంవత్సరంలో విద్యాభ్యాసం చేసిన విద్యార్థులు అప్పటి ఉపాధ్యాయ బృందాన్ని సన్మానించుకున్నారు. ఈ సందర్భంగా అనాటి తీపి గుర్తులను నె మరువేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



యాచారం : సమ్మేళనంలో పాల్గొన్న నందివనపర్తి పాఠశాల పూర్వ విద్యార్థులు, టీచర్లు



కందుకూరు : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

దైవ కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలి



ఉత్సవ కమిటీ, నిర్వాహకులను సన్మానిస్తున్న శ్రీనివాస్ రెడ్డి

కడ్తాల్, ఫిబ్రవరి 25: దైవ కార్యక్రమాల్లో ప్రతీ ఒక్కరు పాలు పంచుకోవాలని ఎంపీటీసీల ఫోరం జిల్లా గౌరవాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్ రెడ్డి కోరారు. దైవ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజ శాంతికి, మానవాళి సన్మార్గ పురోగమనానికి దోహదపడుతాయని అన్నారు. కడ్తాల శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయాన్ని ఆదివారం శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, అర్చకులను సత్కరించి దుస్తులు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం, ఆలయాల అభివృద్ధి, అర్చకుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ వేణుగోపాల్, అభివృద్ధి కమిటీ చైర్మన్ ఆంజనేయులు, నాయకులు చేగూరి వెంకటేశ్, బ్రహ్మాచారి, భాస్కర్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, సత్యం యాదవ్, రాజు, రాజేశ్, మహేందర్, ప్రవీణ్‌గౌడ్, మహేశ్, శ్రీకాంత్, శ్రీను, బాబు, యాదయ్య, లక్ష్మయ్య, శ్రీనివాసాచారి, మల్లేశ్, అర్చకులు శ్రీమన్నారాయణ, శ్రీధర్, వెంకటేశ్, తదితరులున్నారు. అలాగే చెన్నకేశవస్వామి ఆలయాన్ని ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యానాయక్, మల్లేశ్‌గౌడ్, మోతీనాయక్, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రైలుకింద పడి గుర్తుతెలియని యువకుడు ఆత్మహత్య



షాద్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 25: రైలుకింద పడి గుర్తుతెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు. సుమారు 20-25 సంవత్సరాల వయస్సు కలిగిన యువకుడు ఆదివారం ఉదయం 9.00 గంటల ప్రాంతం లో గుర్తుతెలియని రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. కాగా, మృతుడి శరీరంపై పసుపు రంగు టీషర్టు, లేత నీలిరంగు ప్యాంట్(చెక్స్) ఉన్నట్లు చెప్పారు. ఆచూకీ తెలిసినవారు 9441407039, 9848090426 నెంబర్లను సంప్రదించి సమాచారం ఇవ్వాలని హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ కోరారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

● ఇరు కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్

శంషాబాద్, ఫిబ్రవరి 25 : మండలంలోని పెద్దతూప్రకు చెందిన ఓ అబ్బాయి మున్సిపాలిటీ పరిధిలోని ఓ అమ్మాయి కొంతకాలంగా ప్రేమించుకొని ఆదివారం పెళ్లి చేసుకున్నారు. కాగా, వారి కుటుంబ సభ్యుల నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ శంషాబాద్ రూరల్ పోలీసులను ఆశ్రయించారు. వివరాల్లోకి వెళితే.. శంషాబాద్ మండలం పెద్దతూప్రకు చెందిన కేతావత్ నర్సింహ(28), సాతంరాయి గ్రామానికి చెందిన అమ్మాయి(20)తో ప్రేమలో పడ్డాడు. నాలుగేళ్లుగా ఒకరినొకరు ప్రేమించుకుంటున్నారు. అయితే, పెళ్లి చేయమని ఇరు కుటుంబికులను కోరగా.. నిరాకరించారు. దాంతో గత్యంతరం లేక షాద్‌నగర్ సమీపంలోని ఓ గుడికి వెళ్లి పెళ్లి చేసుకున్నారు. అనంతరం రక్షణ కల్పించాలని పెద్దషాపూర్‌లోని రూరల్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి పోలీసులకు విన్నవించారు. ప్రేమించి పెళ్లి చేసుకున్నవారు ఇద్దరు కూడా మేజర్లు కావడంతో ఇరుకుటుంబాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి పంపినట్లు పోలీసులు తెలిపారు.

ప్రతీ ఒక్కరు సేవాభావం కలిగి ఉండాలి



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నారాయణ రెడ్డి

ఆమనగల్లు, ఫిబ్రవరి 25: సేవాభావం, దాతృత్వం వ్యక్తి ప్రతిష్ఠకు దోహదపడుతుందని, ప్రతీ ఒక్కరు సేవాభావం కలిగి ఉండాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. ఉన్నంత లో పరులకు సాయమందించి జీవితాన్ని సార్థకం చేసుకోవాలని ఆయన కోరారు. ఆమనగల్లు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఆదివారం ఆమనగల్లు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సీనియర్ పాత్రికేయుడు ఏలె నిరంజన్ వేదశ్రీ దంపతుల కుమారుడు దివంగత మనోజ్ స్మారకార్థం ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు యాచారం వెంకటేశ్వర్లుగౌడ్, జిల్లా చైర్మన్లు జూలూరి రమేశ్, ఎం.చంద్రశేఖర్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహలతో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ప్రారంభించారు. సీఐ విజయ్‌కుమార్, ఎస్ఐ బాల్‌రామ్‌నాయక్, కాంగ్రెస్ మండలాధ్యక్షులు జగన్, బీచ్యనాయక్, వస్పుల మానయ్య, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, లయన్స్‌క్లబ్ సభ్యులు కర్నాటి కొండల్ రెడ్డి, ఎంఏ పాష, తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌ను విస్తరిస్తాం : ఎమ్మెల్యే

ఆమనగల్లు బస్టాండ్‌ను త్వరలో విస్తరించి ప్రయాణికులకు మరిన్ని మెరుగైన వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి తెలిపారు. బస్టాండ్‌ను ఆయన సందర్శించి ఆవరణ, మరుగుదొడ్లు, మూత్రశాలలను పరిశీలించి ప్రయాణికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం గురించి మహిళలతో ఆరా తీశారు. దుకాణ సముదాయాలతో బస్టాండ్ ఇరుకుగా మారిందని, బస్టాండ్‌ను విస్తరించి ప్రయాణికులకు అనుగుణంగా సదుపాయాలు కల్పించాలని స్థానిక నాయకులు ఎమ్మెల్యేను కోరారు. ఆర్టీసీ ఉన్నతాదికారులతో మాట్లాడి బస్టాండ్ ను విస్తరిస్తామని నారాయణరెడ్డి పేర్కొన్నారు.

రేపు బీఆర్‌ఎస్ నియోజకవర్గ స్థాయి సమావేశం

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 25 : బీఆర్‌ఎస్ పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ స్థాయి సమావేశం రేపు (మంగళవారం) నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మన్నెగూడలోని వేద కన్వెన్షన్‌లో ఉదయం 10 గంటలకు జరిగే సమావేశంలో బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డిలు పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న పినపాక ప్రభాకర్

షాద్‌నగర్, ఫిబ్రవరి 25 : ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబాలకు టూవీలర్ మెకానిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాయకులు ఆర్థిక సాయం అందజేశారు. ఈమేరకు ఆదివారం షాద్‌నగర్ పట్టణంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్ వేములనర్వ గ్రామానికి చెందిన అనిల్‌కుమార్, మాల్ ఎలికట్ట గ్రామానికి చెందిన దుర్గా ప్రసాద్ కుటుంబాలకు(ఒక్కొక్కరికి) రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు సుధాకర్ గౌడ్, భాస్కర్, రాజేశ్, రఘు, బాలరాజు, సలీం తదితరులు పాల్గొన్నారు.

పట్నం రాజేందర్‌రెడ్డి ఆశయ సాధనకు కృషి

● ఎమ్మెల్యే కాలె యాదయ్య, జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి

షాబాద్, ఫిబ్రవరి 24 : బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేసిన దివంగత నేత పట్నం రాజేందర్‌రెడ్డి ఆశయ సాధనకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలె యాదయ్య, జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి తెలిపారు. పట్నం రాజేందర్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం పీఆర్ఆర్ మినీ స్టేడియంలో జిల్లాస్థాయి క్రికెట్, వాలీబాల్ పోటీలను బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డితో కలిసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లోని యువత క్రీడల్లో రాణించేందుకు రాజేందర్‌రెడ్డి ఎంతో కృషి చేశారన్నారు. ఆయన ఆశయం మేరకు షాబాద్‌లో పీఆర్ఆర్ మినీ స్టేడియం ఏర్పాటు చేసినట్లు గుర్తుచేశారు. గ్రామీణ యువకులు క్రీడల్లో రాణించి మండలానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. క్రీడాకారులకు సహాయసహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు మద్దూరి పాండు, రమేష్‌యాదవ్, రాంచంద్రారెడ్డి, సుదర్శన్, శివకుమార్, మాజీ సర్పంచులు దర్శన్, కృష్ణగౌడ్, చంద్రశేఖర్, జంగయ్య, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి